క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం



కర్నూలు కల్చరల్: కర్నూలు రాయలసీమ క్రిస్టియన్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న దారపోగు ప్రకాష్‌కి రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీ తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆంజనేయులు పర్యవేక్షణలో 'ఆచార్య కొలకలూరి ఇనాక్ కవిత్వం – సామాజిక చైతన్యం' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అవార్డు ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. డాక్టరేట్ పొందిన ప్రకాష్‌కు రాయలసీమ క్రిస్టియన్ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఆధ్యాత్మిక సేవలో పాలు పంచుకోవాలి



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక సేవలో పాలు పంచుకోవాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆయన సందేశమిస్తూ ప్రతి ఒక్కరు భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఇది మానవ జీవనానికి దిక్సూచిలా పనిచేస్తుందన్నారు.

వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు విచారకరం

కర్నూలు(రాజ్‌విహార్): సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేస్తున్న ఆరోపణలు విచారకరమని రిటైర్డు తహసీల్దార్ సయ్యద్ రోషన్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద, సామాన్య కుటుంబాలకు ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్న వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు. ఇలాంటి వ్యవస్థపై తప్పుడు ప్రచారాలు, విషయం చిమ్మడాలు తగదన్నారు. ప్రజలకు మేలు చేసే వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పాటు జనంలో పెరుగుతున్న ఆదరణను దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు.

మహాపాదయాత్రను జయప్రదం చేయండి

కర్నూలు(రూరల్): జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని ఈ నెల 26 నుంచి 31 తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న మహాపాదయాత్రను జయప్రదం చేయాలని నగర కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. పాదయాత్రను విజయవంతం చేయాలని ఆదివారం మూడవ రోజు శేషాద్రి ఆధ్వర్యంలో నగరంలోని బిర్లగడ్డ నుంచి టీ క్యాంప్, అరోరా నగర్ మీదుగా సిల్వర్ జూబ్లీ కళాశాల వరకు పర్యటన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చలపతి, సుధాకరప్ప, నరసింహులు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడిగా సముద్రాల

కర్నూలు (న్యూసిటీ) : టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడిగా సముద్రాల హనుమంతరావు నియమితులయ్యారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన మీద నమ్మకంతో టీడీపీ అధిష్టానం టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడిగా నియమించిందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, అచ్చెన్నాయుడు, బీటీ. నాయుడు, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ.భరత్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

చిన్నారులను ప్రోత్సహించాలి

కర్నూలు కల్చరల్: చిన్నారులకు ఇష్టమైన కళా రంగంలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి అన్నారు. ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న ఉచిత కోలాటం శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాఘవేంద్ర స్వామి సేవా సత్సంగం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం లలితా పీఠంలో కోలాటంలో ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మన పూర్వపు ఆటలు, పాటలు, విన్యాసాలు మరిచి పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

యువత క్రికెట్‌లో రాణించాలి

కర్నూల్(రూరల్): యువత క్రికెట్‌లో రాణించాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్ గౌడ్ అన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసిందన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు రంజీ జట్టు, టీమిండియా ఉమెన్స్ జట్టులో పాల్గొని ప్రతిభ కనపరిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి నాగేంద్ర నాథ్, చంద్రశేఖర్, విట్టు రమేష్, రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆధునిక బస్ షెల్టర్లు

- పదేళ్లనాటి 47 పాత షెల్టర్ల తొలగింపు
- 10 ముఖ్య ప్రాంతాలను గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- విజయవాడ తరహా షెల్టర్ల ఏర్పాటు





నూతనంగా ఏర్పాటు చేయనున్న ఆధునిక బస్ షెల్టర్, నగరంలో తొలగించిన పాత బస్ షెల్టర్లు

కర్నూలు (టౌన్) : స్మార్ట్ సిటీలో భాగంగా పదేళ్ల క్రితం నాటి కాలం చెల్లిన బస్ షెల్టర్లకు నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మంగళం పాడారు. గతంలో ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేయడం, బిచ్చగాళ్లకు ఆవాసంగా మారడం, కొన్ని నిరుపయోగంగా ఉండటంతో వాటిని తొలగించారు. వాటి స్థానంలో ఆధునిక బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే విజయవాడలో ఉన్న షెల్టర్లకు మంచి స్పందన రావడంతో అదే తరహాలో ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఈనెల 7వ తేదీ కలెక్టరేట్‌లో ట్రాఫిక్‌పై జరిగిన సమావేశంలో ట్రాఫిక్ నియంత్రణ, ట్రాఫిక్ సర్కిళ్లు, బస్ షెల్టర్లపై చర్చించారు. అందులో భాగంగానే పలు నిర్ణయాలు తీసుకున్నారు.

పలు చోట్ల పనులు ప్రారంభం

నగరంలో బళ్లారి చౌరస్తా నుంచి ఉల్చాల జంక్షన్ వరకు, అలాగే నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ వద్ద ఎదురుగా బజాజ్ షోరూం వైపు పనులు ప్రారంభించారు. ఇప్పటికే శ్రీరామ థియేటర్ వద్ద ట్రాఫిక్ సర్కిల్ ఏర్పాటు చేశారు. బిర్లా సర్కిల్ వద్ద మరో సర్కిల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇక బస్ షెల్టర్ల ఏర్పాటుకు సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కసరత్తు చేస్తున్నారు.

10 ప్రాంతాల్లో నూతనంగా బస్ షెల్టర్లు

నగరంలో ఇప్పటికే పదేళ్ల క్రితం ఉన్న 47 పాత షెల్టర్లు తొలగించారు. స్థానికంగా బిర్లాగేట్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రెండు షెల్టర్లు, శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ వద్ద ఉన్న రెండు షెల్టర్లు, రాజ్‌విహార్ పాతబస్టాండ్ డిపో వద్ద రెండు, మెడికల్ కళాశాల వద్ద, వెంకటరమణ తదితర కాలనీలలో ఉన్న వాటిని తొలగించారు. ఎక్కువ శాతం నిరుపయోగంగా ఉండటం, అనవసరమైన ప్రాంతాల్లో ఉండటంతో వీటన్నింటిని పూర్తిగా తీసేశారు. తాజాగా సీ. క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు రెండు చోట్ల, కలెక్టరేట్ వద్ద రెండు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, రాజ్‌విహార్, శ్రీరామ థియేటర్ బళ్లారి చౌరస్తా వద్ద రెండు చొప్పున ఆధునిక బస్ షెల్టర్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

నగరపాలికకు ఖర్చు లేకుండా..

నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధునిక బస్ షెల్టర్లకు సంబంధించి టెండర్ల ద్వారా ఏజెన్సీలకు పనులు కేటాయించనున్నారు. వీటి నిర్మాణంలో నగరపాలక ఒక్క రూపాయి ఖర్చు పెట్టదు. లీజుకు స్థలం తీసుకున్న ఏజెన్సీ నిర్వాహకులు పట్టణ ప్రణాళిక విభాగం సూచించిన ఆధునిక బస్ షెల్టర్లు (స్టీల్) ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ షెల్టర్లలో వాణిజ్య ప్రకటనలు వేసుకోవచ్చు. వాణిజ్య ప్రకటనల ద్వారా ఏజెన్సీలకు ఆదాయం వస్తుంది. తద్వారా పట్టణ ప్రణాళిక విభాగానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. త్వరలోనే టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు సమాయత్తం అవుతున్నారు.



స్మార్ట్‌సిటీలో భాగంగానే నూతన బస్ షెల్టర్ల ఏర్పాటు

స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలో ఆధునిక బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్, నగరపాలక కమిషనర్ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాం. నగరంలో ట్రాఫిక్ రద్దీ, వాహనాల రద్దీని నియంత్రించేందుకు సర్కిళ్లు, విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. ముఖ్యమైన ప్రాంతాల్లో 10 చొప్పున బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా టౌన్ ప్లానింగ్‌కు టెండర్ల ద్వారా, ఏటా యాడ్ ఏజెన్సీలు ఫీజులు చెల్లించడం ఆదాయం సమకూరుతుంది. – మోహన్‌కుమార్, ఇన్‌చార్జీ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ విభాగం

కళాకారుడికి రిటైర్మెంట్ లేదు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: కళాకారుడికి రిటైర్మెంట్ లేదని పూర్వపు కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య అన్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సంగా ఆంజనేయులుకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా బలరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి వృత్తి జీవితంలో పదవీ విరమణ ఉంటుందేమో కానీ కళాకారుడికి ఊపిరి ఉన్నంత వరకూ రిటైర్మెంట్ ఉండదన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షతన సంగా ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు ఇనాయతుల్లా, మహమ్మద్ మియ్యా, శ్రీష్టఫర్, రాజారత్నం, అంకయ్య, యాగంటీశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

'క్లాప్' డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (రూరల్): నగర పాలక పరిధిలో విధులు నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలను సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, రామాంజనేయులు కోరారు. ఆదివారం నగరంలోని సుర్జీత్ భవన్‌లో సీఐటీయూ నగర ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో వున్న జీతాలను మంజూరు చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సాయిబాబా, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఎన్నిక

కర్నూలు(రూరల్): నగరంలోని కేకే భవనంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా తెలిపారు. సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగిందని చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలలో మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్ష, కార్యదర్శులుగా అమర్ బాబు, సాయి ఉదయ్, ఉపాధ్యక్షులుగా నరసింహా, అబూబాకర్, భాస్కర్ తదితరులను ఎన్నుకున్నారు.

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన



అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- 12వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో లబ్ధిదారులకు పథకాల సొమ్మును నేరుగా వారి ఖాతాలోనే జమ చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన స్థానిక 12వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వడ్డెగేరి, కేవీఆర్ గార్డెన్స్ ఏరియాల్లోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి యజమానులకు సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. వారికి పథకాల వలన చేకూరిన లబ్ధి, వాటి విలువను వివరించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పథకాల అమలులో అవినీతి, అక్రమాలు అధికంగా ఉండేవన్నారు. నేడు దరఖాస్తు మొదలు పథకాల మంజూరు వరకు అన్నీ ఆన్‌లైన్‌లో నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకే నగదు జమ అవుతోందన్నారు. దీంతో ఎలాంటి అవినీతికి తావు లేదని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ కో ఆప్షన్ మెంబర్లు సయీం, చాట్ల మేరి, నాయకులు హనీఫ్, షేక్షా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీబీఎస్ఎస్ గౌరవ సలహాదారుగా చంద్రశేఖర్‌రావు



వెల్లాలా మధుసూదన శర్మను సన్మానిస్తున్న జిల్లా కమిటీ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య (ఏపీబీఎస్ఎస్) రాష్ట్ర గౌరవ సలహాదారుగా కోలుకుల చంద్రశేఖర్‌రావును నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాలా మధుసూదన శర్మ ఆదేశాలు జారీ చేశారు. నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని దేవీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మాస శివరాత్రి అభిషేకం పూజల్లో పాల్గొన్న మధుసూదన శర్మ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏపీబీఎస్ఎస్ఎస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా కమిటీ తరుపున రాష్ట్ర అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు నందేల్ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి కంచుగంటల శ్యామ్‌సుందర్ రావు, జిల్లా అధ్యక్షుడు నాగులవరం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ ఫల్గుణకుమార్

కర్నూలు (టౌన్) : ఆదాయ పన్ను, జీఎస్టీ (వస్తు సేవల పన్ను) చట్టాలపై అవగాహన అవసరమని తిరుపతికి చెందిన సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ డాక్టర్ ఫల్గుణకుమార్ వెల్లడించారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని స్కందాన్షి భవన్‌లో క్రెడాయ్ (కాన్ఫడరేషన్ రియల్ ఎస్టేట్ అండ్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఆదాయపు పన్ను, జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టంలో ఉన్న పరిమితులను, అందులో ఉన్న క్లిష్టమైన సమస్యలపై పూర్తిగా తెలుసుకోవాలన్నారు. అలాగే ట్యాక్స్ ప్రాక్టీసనర్స్, వ్యాపారులు, బిల్డర్స్ అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. అనంతరం క్రెడాయ్ ఆధ్వర్యంలో చార్టర్డ్ అకౌంటెంట్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్రెడాయ్ చైర్మన్ సోమిశెట్టి వెంకట్రామయ్య, ప్రధాన కార్యదర్శి తారకేష్, ఉపాధ్యక్షులు భరత్‌రెడ్డి, ఏపీ క్రెడాయ్ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రైతుబజారులో వ్యాపారుల ఇష్టారాజ్యం



రైతుబజారులో షాపును కాదని ముందుకు వచ్చి వ్యాపారాలు చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో రైతులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యాపారులు తమకు కేటాయించిన షాపులను 4–5 అడుగుల మేర ముందుకు విస్తరించడమే ఇందుకు ప్రధాన కారణం. రైతుబజారులో ఎస్టేటు అధికారి కార్యాలయం నుంచి పై వైపునకు 108 పైగా షాపులను వివిధ వ్యాపారాలకు కేటాయించారు. వీరు తమ వ్యాపారాలను కేవలం షాపులోపలి వరకు మాత్రమే నిర్వహించుకోవాలి. కానీ, షాపు కాకుండా 5 అడుగుల వరకు ముందుకు వచ్చి సరుకులు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. ఇది వినియోగదారులకు, రైతులకు ఇబ్బందిగా మారింది. రైతులు కూర్చోవడానికి, వినియోగదారుల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఒకరిని చూసి మరొకరు ముందుకు వస్తుండటం గమనార్హం. వారి సరుకులన్నీ లోపలికి పెట్టించండి.. మేము లోపలే పెట్టుకుంటామని వ్యాపారులు ఒకరిపై ఒకరు నింద వేసుకుంటున్నారు. రైతుబజారు అధికారులు చూసి చూడనట్లు పోతుండటంతోనే వ్యాపారులు షాపును దాటి ముందుకు వస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయమై కొంతమంది వ్యాపారులు స్పందన కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికైన రైతుబజారు అధికారులు చర్యలు తీసుకొని దుకాణదారులు ముందు భాగంలో సరుకులు పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

వజ్రోత్సవాలకు సిద్ధం కండి

కర్నూలు కల్చరల్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలోని ఉపాధ్యాయులు వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం కావాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో జరిగిన రాయలసీమ జిల్లాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాలకుపైగా ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న మాట్లాడుతూ ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలు కర్నూలులో ఘనంగా నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. వేడుకలకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షులు గంటా మోహన్, చంద్రశేఖర్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు ప్రసన్న రాజు, మహమ్మద్ ఇక్బాల్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్ కాలపరిమితి పెంచాలి

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్ గడువును పెంచాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 3,618 మంది జనరల్, వొకేషనల్ గ్రూపులలో పనిచేస్తున్నారని, ఇందులో 2023–24 విద్యా సంవత్సరానికి 11 నెలల కాలానికి మాత్రమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. వెకేషన్ కాలంలో కూడా సప్లిమెంటరీ విద్యార్థుల ఉత్తీర్ణతకు, రెమిడియల్ క్లాసులు, విద్యార్థులను కళాశాలలో చేర్పడం (అడ్మిషన్ డ్రైవ్) లాంటి విధులు నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఎలాంటి బ్రేక్ లేకుండా 12 నెలల కాలానికి రెన్యూవల్ ఉత్తర్వులను సవరించి జారీ చేయాలని కోరారు.

అక్రమ భవన నిర్మాణాలకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (టౌన్) : నగరంలో అక్రమ భవన నిర్మాణాలకు నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. గాంధీనగర్‌లో రెండు వాణిజ్య భవనాలు, అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న భవనాలు ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్నాయని, దీని వల్ల ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడతారని ఈనెల 7వ తేదీ సాక్షి దినపత్రికలో నిబంధనలకు 'పాతర– అక్రమాల జాతర' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై చర్యలు తీసుకోవడంతో పాటు నోటీసులు జారీ చేయడంలో నగరపాలక అధికారులు తీవ్ర జాప్యం చేశారు. రెండు రోజుల తరువాత ఎట్టకేలకు ఈ భవనాలకు మొదటి విడత నోటీసులు జారీ చేశారు. స్పందించకుంటే నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు రెండో నోటీసు పంపుతామని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఆదివారం తెలిపారు.

20న 'మానవత' నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కర్నూలు కల్చరల్: మానవత స్వచ్ఛంద సంస్థ కర్నూలు నగరం యూనిట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వీఆర్‌కాలనీలోని సంస్థ కార్యాలయంలో సంస్థ సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈనెల 20న సాయంత్రం 4.30 గంటలకు సంస్థ కార్యాలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. సంస్థ ఫౌండర్, రాష్ట్ర కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమానికి సంస్థ సభ్యులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంస్థ సభ్యులు పాటిల్ హనుమంతరెడ్డి, యుగంధర్ శెట్టి, రమణ, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్థికంగా భారత దేశాభివృద్ధి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: సమాజ సేవకులు, రచయిత ఎస్.షేక్షావలి రచించిన 'ఆర్థికంగా భారత దేశాభివృద్ధి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, తమ్మిశెట్టి ప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆర్థికంగా భారతదేశం ఎలా ఎదిగింది, ప్రస్తుత పరిస్థితిని గురించి రచయిత వివరించిన శైలిని ప్రశంసించారు. రచయిత తీసుకున్న పుస్తక మూల అంశం గొప్పదని కొనియాడారు. ప్రముఖ రచయిత బెల్దోనా కృష్ణమూర్తి పుస్తకాన్ని సమీక్షించారు. అనంతరం పుస్తక ముద్రణకు ఆర్థికంగా సహాయం అందించిన పి.సోఫియాబీని సత్కరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు వనుపులేటి నీలిమ, బురానుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

దేశ, ధర్మ రక్షణలో ముందుండాలి

కర్నూలు కల్చరల్: ధర్మ రక్షణలో భజరంగ్ దళ్ ఎల్లప్పుడూ ముందుంటుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకటరామయ్య అన్నారు. ఆదివారం ఓల్డ్‌సిటీలోని బాలసాయిబాబా మందిరంలో వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ, ధర్మ రక్షణలో భజరంగ్ దళ్ కార్యకర్తలు ముందుండాలన్నారు. హిందూ సమాజ సంఘటనకు భజరంగ్ దళ్ అనేక సేవా కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. హిందూ యువకుల్లో దేశభక్తిని, దైవభక్తిని పెంపొందిస్తుందని చెప్పారు. భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాప్‌రెడ్డి, కర్నూలు విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ, నాయకులు కమ్మయ్య, నాగిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.